


ఒకటికి రెండు!

గన్నవరంలో వెలుగుచూస్తున్న దొంగ ఓట్లు

- ఒక వ్యక్తికి రెండు, మూడు, నాలుగు ఓట్లు
- తెలివిగా ఫొటోలో తేడాలు చూపించి..
- ఇప్పటికే 4 వేలకు పైగా, తాజాగా మరో 1,500
- చాలామంది సమీప నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలే..
- టీడీపీ పరిశీలనలో బయటపడిన నిజాలు
- ఎన్నికల సంఘానికి యార్లగడ్డ ఫిర్యాదు





మనీషా పేరుతో వేర్వేరు ఓట్లు

ఎప్పుడో పాతకాలం నాటి ఫొటోతో ఒక ఓటు.. తాజా ఫొటోతో మరో ఓటు.. కళ్లజోడు పెట్టుకుని ఒక ఓటు.. తీసేసి ఇంకో ఓటు.. షర్ట్ మార్చి ఒకటి.. టీషర్టుతో ఇంకొకటి.. అబ్బో తవ్వేకొద్దీ గన్నవరం నియోజకవర్గంలో దొంగ ఓట్లు బయటపడుతూనే ఉన్నాయి. ఫొటోల్లో తేడా చూపించి ఒక వ్యక్తికి ఒకటికి నాలుగు ఓట్ల వరకు నమోదు చేస్తున్నారు. ఎన్ని అక్రమాలకు పాల్పడ్డా పేర్లు మాత్రం మార్చడం కుదరదు కదా.. ఆ పేర్లే ఇప్పుడు గన్నవరంలో భారీగా నమోదైన వైసీపీ దొంగ ఓట్లను బయటపెడుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : గన్నవరంలో ఓట్ల అక్రమాలు భారీగా బయటపడుతున్నాయి. దొంగ ఓట్లపై దృష్టి సారించిన ప్రతిపక్షాలు.. అధికార పార్టీ ఓట్ల అక్రమాలను బహిర్గతం చేస్తున్నాయి. గన్నవరంలో ఇతర నియోజకవర్గాల నుంచి చేర్చిన ఓటర్లు, డబ్లింగ్ ఓటర్లపై టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధారాల సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో అసలు విషయాలు బయటకు వచ్చాయి.

అక్రమాలు ఇలా..

గన్నవరం నియోజకవర్గంలో ఇప్పటికే 4 వేలకు పైగా దొంగ ఓట్లను టీడీపీ గుర్తించింది. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు కూడా చేసింది. తాజాగా మరో 1,500 పైచిలుకు బోగస్ ఓట్లపై ఫిర్యాదు చేశారు. సమీపంలోని నియోజకవర్గాలకు సంబంధించిన 934 మంది ఓటర్లు గన్నవరం నియోజకవర్గంలోకి వచ్చారని, మరో 724 ఓట్లు డబుల్ ఎంట్రీలుగా నమోదయ్యాయని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా ఎన్ని వేలసంఖ్యలో దొంగ ఓట్లను నమోదు చేశారన్న దానిని టీడీపీ నాయకులు పరిశీలిస్తు న్నారు. తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు చెందిన ఓటర్లను గన్నవరంలో చేర్చారు. విజయవాడలో స్థానికంగా ఆయా నియోజకవర్గాల్లో ఓట్లను కలిగి ఉండటమే కాకుండా, గన్నవరంలో కూడా ఓటు కల్పించారు. వీరంతా వైసీపీ కార్యకర్తలే కావడం గమనార్హం. అలాగే, సమీపంలోని నూజివీడు, ఏలూరు, దెందులూరు, గుడివాడ, పామర్రు నియోజకవర్గాలకు చెందిన వైసీపీ ఓటర్లను కూడా గన్నవరంలో ఓటర్లుగా నమోదు చేశారు.

పేర్లే బయటపెట్టాయి..

సమీప నియోజకవర్గాలకు చెందిన వారిని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండల ఓటర్ల జాబితాలో చేర్చారు. సమీప నియోజకవర్గాల నుంచి తీసుకొచ్చిన వారికి రెండు నుంచి నాలుగు వరకు ఓట్లుగా నమోదు చేశారు. ఇందుకోసం చాలా తెలివి ఉపయోగించారు. మల్టిపుల్ బూత్ యాడింగ్ పేరిట.. ఒకే ఓటరును వేర్వేరు బూత్‌ల పరిధిలోకి తీసుకొస్తారు. దీంతో ఏ బూత్‌కు ఆ బూత్‌లో కొత్త ఓటరుగా నమోదై ఉంటారు. ఓటర్ల జాబితాలో ఈ మల్టిపుల్ యాడింగ్ ఓటర్లను గుర్తించకుండా ఉండటానికి ఫొటోలను తెలివిగా వాడారు. ఒక్కో బూత్‌లో ఒక్కో రకంగా ఫొటోను వాడారు. పాత ఫొటోలు, కొత్త ఫొటోలు ఇలా వాడారు. కొన్ని ఫొటోలు జూమ్ అవుట్ చేసి.. మరికొన్ని ఫొటోలు జూమ్ ఇన్ చేసి.. వాడారు. కొన్ని ఫొటోలకు కళ్లజోళ్లు పెట్టి, మరికొన్నింటికి కళ్లజోళ్లు తీసేసి డబ్లింగ్ ఓట్లుగా నమోదు చేశారు. ఒక నియోజకవర్గంలో వేర్వేరు బూత్‌లలో ఉన్న వీరంతా ఒకరేనన్న భ్రమ కల్పించటానికి వీలుగా ఈ ఎత్తుగడ ఎన్నుకున్నారు. ఫొటోలను మార్చినంత తేలిగ్గా పేర్లను మార్చలేరు కదా. ఈ పేర్ల దగ్గర ఓట్ల దొంగలు దొరికారు. బూత్ లెవల్‌లో ఎనలైజేషన్ విధానాన్ని ప్రతిపక్షాలు ఎప్పుడైతే అవలంబించాయో అధికార పార్టీ దొంగ ఓట్లు వెలుగులోకి వస్తున్నాయి. గన్నవరం నియోజకవర్గంలో దాదాపు 7వేల నుంచి 8వేల వరకూ దొంగ ఓట్లను నమోదు చేయించినట్టుగా తెలుస్తోంది.



రొయ్యూరులో ఇసుకాసురులంతా మంత్రి జోగి అనుచరులే!

ప్లేసు మారినా.. తీరు మారలే!

పెనమలూరు ఇన్‌చార్జిగా వచ్చినప్పటి నుంచీ క్వారీలు హస్తగతం

జిల్లాలో ఇసుక అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. నిబంధనలను తుంగలోతొక్కి ఇసుకాసురులు ఇష్టారీతిన తవ్వి తరలిస్తున్నారు. పర్యావరణ అనుమతులు లేకపోయినా పట్టించుకోవడం లేదు. తవ్వకాలను అధికారులు అడ్డుకున్నా ఆగడం లేదు. ఎవర్నీ రానీయకుండా బాడీగార్డును పెట్టి.. భారీ యంత్రాలతో ఇసుకను తోడి.. లారీల్లో నిర్విరామంగా తరలిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. తోట్లవల్లూరు మండలం రొయ్యూరు క్వారీలో ఈ అక్రమం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్టుగా సాగుతోంది. ఈ అక్రమం వెనుక అత్యున్నత స్థాయి ప్రజాప్రతినిధి ఉండటం వల్లే తవ్వకాలవైపు ఉన్నతాధికారులు కనెత్తిచూడకపోవడానికి కారణమని తెలుస్తోంది. మంత్రి పెడన నుంచి పెనమలూరుకు ఇన్‌చార్జిగా వచ్చినప్పటి నుంచి ఇసుక తవ్వకాలు ముమ్మరమయ్యాయి.

- రోజుకు 500 లారీల ఇసుక తరలింపు
- రేవుకు వెళ్లే దారిలో చెక్‌పోస్టు, బాడీగార్డు ఏర్పాటు
- అక్రమార్కుల చేతుల్లోనే అధికారులు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలం రొయ్యూరు క్వారీ వద్ద జోగి మనుషులు పెత్తనం చెలాయిస్తున్నారు. క్వారీకెళ్లే దారిలో చెక్‌పోస్టు ఏర్పాటుచేసి బాడీగార్డును పెట్టారు. గతంలో గుడివాడ మంత్రి కొడాలి నాని అనుచరులు రొయ్యూరు, లంకపల్లి క్వారీలను గుప్పెట్లో పెట్టుకుని కోట్లాది రూపాయల ఇసుకను దోచుకుంటే ఇపుడు మంత్రి జోగి ఆ పాత్రను పోషిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

7 యంత్రాలు.. వందలాది లారీలు

రొయ్యూరు క్వారీలో ఏడు యంత్రాలు దించారు. వందల లారీలతో ఇసుకను తరలిస్తున్నారు.పర్యావరణ అనుమతులు రాకుండానే జనవరి 12 నుంచి ఇసుక అక్రమానికి తెరదీశారు. ప్రతిరోజూ సుమారు 500 లారీల ఇసుక తరలిస్తున్నారు. ఇసుక తవ్వకాలను తహసీల్దార్ మూడుసార్లు అడ్డుకున్నారు. అయినా లెక్కచేయకుండా మళ్లీ యథేచ్ఛగా తవ్వకాలను కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక అక్రమాలు జరుగుతున్నాయని జాతీయ గ్రీన్‌ట్రిబ్యునల్ (ఎన్జీటీ) నివేదిక ఇచ్చినా అదురూ బెదురు లేకుండా రొయ్యూరులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయంటే రాష్ట్ర ప్రభుత్వ పెద్దల సహకారం ఉండబట్టేనని విమర్శలు వస్తున్నాయి.

రొయ్యూరు క్వారీలో యంత్రాలతో జరుగుతున్న ఇసుక లోడింగ్



అధికారుల వత్తాసు

ఎన్జీటీకి ఫిర్యాదు చేయడంతో ఇటీవల కలెక్టర్ రాజబాబు ఆధ్వర్యంలో అధికారులు ఇసుక తవ్వకాలను పరిశీలించేందుకు వచ్చారు. తవ్వకాలు సాగే రొయ్యూరు క్వారీని పరిశీలించకుండా ఎప్పుడో మూతపడిన నార్తువల్లూరు క్వారీని పరిశీలించడం హాస్యాస్పదంగా ఉంది. సంబంధిత శాఖల అధికారులు అక్రమాలకు ఎంతగా వత్తాసు పలుకుతున్నారో దీనిని బట్టి తేటతెల్లమవుతోంది.

టోల్‌గేట్ ఏర్పాటు

కరకట్ట నుంచి రొయ్యూరు క్వారీకి వెళ్లే రహదారిలో కొత్తగా ఓ టోల్‌గేట్‌ను ఏర్పాటు చేసి అక్కడ ఓ బాడీగార్డును నియమించారు. మీడియా అని అనుమానం వస్తే 'ఎవరు మీరు? ఎక్కడికి వెళ్లాలి?' అని ప్రశ్నించి వచ్చినవారి సమాచారాన్ని లోపల ఉన్న వ్యక్తులకు బాడీగార్డు అందిస్తాడు. గతంలో అక్రమాలు నడిచినా విలేకరులు ధైర్యంగా క్వారీలోకి వెళ్లి ఫొటోలు తీసే పరిస్థితి ఉండేది. మంత్రి అనుచరులు వచ్చాకే ఈ బాడీగార్డు ఏర్పాటు వల్ల రొయ్యూరు క్వారీలోకి వెళ్లి రావడం సాహసమవుతోంది.

స్థానికులకు తాయిలాలు

ఎవరూ ఫిర్యాదు చేయకుండా రొయ్యూరు గ్రామస్తులను ఇసుక క్వారీ నిర్వాహకులు మచ్చిక చేసుకున్నారు. ఓ సొసైటీ వ్యక్తులు అభ్యంతరం చెప్పటంతో రూ.3 లక్షలు ఇచ్చినట్టు తెలిసింది. గ్రామంలోని ట్రాక్టర్లు, లారీలు ఇసుక కోసం వస్తే 50 శాతం రాయితీతో వెంటనే లోడుచేసి పంపుతున్నారు. దీంతో స్థానిక బలం పెంచుకుని అడ్డూఅదుపు లేకుండా నిర్వాహకులు ఇసుక దోపిడీ సాగిస్తున్నారు.

తవ్వకాలకు అనుమతులు రాలేదు

పర్యావరణ అనుమతి వచ్చిందని అంటున్నారు. అయితే ఆ కాపీ మాకు అందలేదు. ఇసుక ఎక్కడ ఎంత విస్తీర్ణంలో తవ్వాలో హద్దులు చూపేందుకు మమ్మల్ని ఎవ్వరూ అడగలేదు.

– ఎం.కుసుమకుమారి, తహసీల్దార్

జలవనరుల శాఖ స్పెషల్ డివిజన్‌లో ఓ ఉద్యోగి నిర్వాకం

వెకిలి చేష్టలు.. వేధింపులు..

- మహిళా ఉద్యోగి పట్ల అసభ్య ప్రవర్తన
- తండ్రి వద్ద విలపించిన బాధితురాలు
- కార్యాలయానికి వచ్చి ఉద్యోగి చెంపచెళ్లుమనిపించిన తండ్రి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఎదురుగా జలవనరుల శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం. వెనుక వైపు జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయం. ఆ చెంతనే చీఫ్ ఇంజనీర్ ఆఫీసు. ఇంత వీఐపీ ప్రదేశానికి మధ్యలో ఉన్న స్పెషల్ డివిజన్ కార్యాలయంలో కీచకపర్వం నడుస్తోంది. కొంతమంది అధికారులు మహిళా ఉద్యోగులపై అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారు. విధినిర్వహణలో వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా ఈ డివిజన్‌లో నాల్గోస్థాయి అధికారి వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ద్వంద్వార్థాలు వచ్చే పదాలను ఉపయోగిస్తూ మహిళలతో మాట్లాడుతున్నాడు. ఆ అధికారి చేష్టలకు విసుగుపోయిన ఓ మహిళా ఉద్యోగి తండ్రితో వ్యథను పంచుకుంది. కన్న కుమార్తె కన్నీటిని చూసిన ఆ తండ్రి నేరుగా కార్యాలయానికి వచ్చి వేధింపులకు దిగిన అధికారి చెంపను చెళ్లుమనిపించాడు. గురువారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఆది నుంచి అంతేనా...

జలవనరుల శాఖలో కృష్ణా తూర్పు, కృష్ణా సెంట్రల్, డ్రెయినేజ్, స్పెషల్ డివిజన్లు ఉన్నాయి. ఇవన్నీ జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలోనే ఉంటాయి. ఒక్కో డివిజన్‌లో ఈఈ, డీఈ, ఏఈలు ఉంటారు. స్పెషల్ డివిజన్ కార్యాలయంలో ఏఈల తర్వాత స్థాయి అధికారి.. మొత్తం కార్యాలయంలోని ఉద్యోగుల విధులను పర్యవేక్షిస్తుంటాడు. సిబ్బంది సెలవులు, అనుమతులు, వారి నుంచి వెళ్లే ఫైళ్లను ఈయన పరిశీలించి పై అధికారుల టేబుల్‌పైకి పంపుతాడు. ఈ డివిజన్‌లో పురుష ఉద్యోగులతో పాటు మహిళా ఉద్యోగులు ఎదురెదురు వరుసల్లో విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ డివిజన్‌లో ఉన్న ఓ మహిళా ఉద్యోగినిని ఈ అధికారి కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. ఆమె ఏదైనా ఫైలు తీసుకెళ్లినా, సెలవు చీటీలు ఇచ్చినా ద్వంద్వార్థాలు వచ్చేలా, వెకిలిగా మాట్లాడుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. చాలారోజుల పాటు ఆమె ఈ బాధను భరిస్తూ వచ్చింది. చివరికి సహనం నశించడంతో కార్యాలయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇంటి వద్ద తండ్రికి వివరించి కన్నీటి పర్యంతమైంది. ఇంతకాలం లైంగికంగా ఆమె ఎదుర్కొంటున్న ఇబ్బందులను విన్న ఆయనకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గురువారం కుమార్తెను తీసుకుని విధులకు వచ్చాడు. ఆమెను వేధిస్తున్న అధికారి కార్యాలయంలోకి రాగానే వెళ్లి చెంప చెళ్లుమనిపించాడు. మహిళా ఉద్యోగి తండ్రి ఇలా చేయెత్తడంతో అక్కడున్న ఉద్యోగులు, అధికారులు షాక్ అయ్యారు. వెంటనే ఆయన్ను అడ్డుకుని బయటకు పంపించారు. తర్వాత అసలేం జరిగిందని అధికారులు ఆరా తీసి కారణాలు తెలుసుకున్నారు.

ఈ ఘటన బయటకు పొక్కకుండా రహస్యంగా ఉంచారు. ఎదురుగా జలవనరుల శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం, వెనుక వైపు సీఈ, ఎస్ఈ కార్యాలయాలు ఉండటంతో విషయాన్ని బయటకు రానివ్వలేదు. ప్రస్తుతం ఈ ఘటనపై జలవనరుల శాఖ ప్రాంగణంలో చర్చ నడుస్తోంది. మంత్రి క్యాంపు కార్యాలయం, మంత్రి బొత్స సత్యనారాయణ నివాసం, ఉన్నతాధికారుల చాంబర్లు ఉండడంతో విషయం బయటకు రాకుండా అధికారులు జాగ్రత్త తీసుకుంటున్నారు. ఈ ఘటనపై అధికారులు అంతర్గత విచారణకు ఆదేశించినట్టు సమాచారం.

తెలుగు యువత నాయకుడిపై దాడి

- మొక్కు తీర్చుకునే ఏర్పాట్లలో ఉండగా... వైసీపీ మూక పిలిచి మరీ కొట్టారు
- టీడీపీ కార్యకర్తల మధ్య గొడవగా సోషల్ మీడియాలో రివర్స్ ట్రోల్

- 6లో..


గాయపడిన హరికృష్ణ

గ్రూప్-2 పరీక్షకు ఏర్పాట్లు చేయండి

- జేసీ గీతాంజలి శర్మ

- 6లో..

ఉద్యోగుల జాబితాపై కసరత్తు

ఎన్నికల విధుల కోసం స్థానికతను తెలుసుకునేందుకు జాబితాల రూపకల్పన

- ఫొటో గుర్తింపు కార్డులు లేవని వివరాలు ఇవ్వని కొందరు ఉద్యోగులు
- సొంత మండలంలో ఎన్నికల విధులకు అవకాశం లేనట్టే

జిల్లాలో ఉద్యోగుల ఎన్నికల విధులపై కసరత్తు జరుగుతోంది. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే పీవోలు ఏపీవోలు, ఇతర సహాయకుల నియామకం కోసం అందుబాటులో ఉన్న ఉద్యోగుల స్థానికత వివరాల సేకరణ ప్రక్రియ పూర్తిచేసి ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంది. అన్ని వివరాలూ ఇంకా సేకరించకపోవడంతో ఈ ప్రక్రియ ఎంతకూ కొలిక్కి రావడంలేదు. దీనిపై కలెక్టర్ రాజబాబు అసహనం వ్యక్తం చేయడంతో అధికారులు కరసత్తు వేగవంతం చేశారు.

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : జిల్లాలో ఉపాధ్యాయులు, ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు 15వేల మందికిపైగా ఉన్నారు. వీరికి ఎన్నికల విధులు కేటాయించాల్సి ఉంది. జిల్లాలోని అన్ని విభాగాల ఉద్యోగులు, సిబ్బంది గుర్తింపుకార్డు నెంబరు, వారి ఓటరు గుర్తింపు కార్డుల నెంబర్లు, ఆధార్ కార్డుల నెంబర్లను సేకరించాలి. కొందరు ఉద్యోగుల వద్ద ఓటరు గుర్తింపుకార్డులు అందుబాటులో లేకపోవడంతో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు గతంలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ నుంచి వివిధ విభాగాల అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. కొన్ని విభాగాల అధికారులు ఎన్నికలు సమీపించే తరుణంలో తాము బదిలీ అవుతామనే కారణంతో ఈ పనిని ప్రారంభించి పక్కన పెట్టేశారు.

వేగవంతంచేయాలని కలెక్టర్ ఆదేశం

ఉద్యోగుల స్థానికతను గుర్తించే కీలక ప్రక్రియకు సంబంధించిన బాధ్యత నూతనంగా వచ్చిన అధికారులపై పడింది. ఎంతమేర పూర్తయిందనే అంశంపై రెండు రోజులుగా కలెక్టర్ ఆరా తీస్తున్నారు. కొన్ని విభాగాల అధికారుల పనితీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంతో రెండు రోజులుగా ఉద్యోగుల వివరాలు సేకరించే పనిని వేగవంతం చేశారు.

పనిచేస్తున్న మండలంలో ఎన్నికల విధులు లేనట్టే

ఉద్యోగులు, సిబ్బందికి ప్రస్తుతం పనిచేస్తున్న మండలంలో ఎన్నికల విధుల్లో నియమించరు. ఆధార్‌కార్డులు, ఓటరు గుర్తింపుకార్డుల ఆధారంగా ఉద్యోగులు ఏ ప్రాంతంలో నివశిస్తున్నారో వివరాలు నమోదుచేసి ఎన్నికల విధులకు మీరు హాజరు కావాల్సి ఉందని మొదటి విడతగా నోటీసు ద్వారా తెలియజేస్తారు. రెండో విడతలో జారీచేసిన నోటీసులో ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులకు హాజరు కావాల్సి ఉంటుందో తెలియజేస్తారు. పోలింగ్ విధులకు వెళ్లే ఒకరోజు ముందు ఏ గ్రామంలో లేదా ప్రాంతంలో ఎన్నికల విధులు నిర్వహించాల్సి ఉందో మూడో నోటీసులో తెలియజేస్తారు. ఈ వ్యవహారం మొత్తం రాండమ్ పద్ధతిలో జరుగుతుంది.



కమనీయం.. గోపయ్య, తిరుపతమ్మ కల్యాణం

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 23: పెనుగంచిప్రోలులో గోపయ్యస్వామి, తిరుపతమ్మ కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థానం నుంచి అమ్మవారు, స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదిక వరకు శోభాయాత్రగా భక్తులు గోవిందనామస్మరణలతో తీసుకువచ్చారు. పురోహితులు శివరాంబొట్ల ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మర్రిబోయిన గోపీబాబు కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఇవో కె.రమేష్‌నాయుడు, నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, నందిగామ ఏసీపీ రవికిరణ్ దంపతులు పీటలపై కూర్చున్నారు. ఎంపీపీ మార్కపుడి గాంధీ, జడ్పీటీసీ ఊట్ల నాగమణి, గూడపాటి శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఇరుముడులు సమర్పించిన భక్తులు

పెనుగంచిప్రోలు తిరుపతమ్మ పెద్ద తిరునాళ్లు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈవో రమేష్‌నాయుడు, ట్రస్టుబోర్డు చైర్మన్ జంగాల శ్రీనివాసరావులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అంకమ్మ అమ్మవారి వద్ద అఖండ దీపాన్ని వెలిగించి తిరునాళ్లను ప్రారంభించారు. మునేటిలో పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. తిరుపతమ్మ దీక్షాస్వాములు స్థానిక శివాల



ఇరుముడి సమర్పణకు తరలుతున్న దీక్షాస్వాములు

యంలో ఇరుముడులు కట్టించుకుని శోభాయాత్రగా వచ్చి అమ్మవారి ఇరుముడులు సమర్పించుకున్నారు. మునేటి అవతల మామిడితోటల్లో దీక్షాస్వాములకు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి దీక్షాస్వాముల రాకతో పెనుగంచిప్రోలు ఎరుపెక్కింది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అదనపు శానిటేషన్‌ను సర్పంచ్ పద్మకుమారి, ఇవో శ్యాంలు పర్యవేక్షించారు. సీఐ జానకీరాం ఆధ్వర్యంలో ఎస్సై పి.రాంబాబు పర్యవేక్షణలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు.

నేడు ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

వన్‌టౌన్, ఫిబ్రవరి 23 : మాఘపౌర్ణమి సందర్భంగా శనివారం ఉదయం 5.55 నిముషాలకు ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ నుంచి ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కేఎస్ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ నుంచి నాలుగుస్తంభాల సెంటర్, సొరంగం జంక్షన్, కబేళా రోడ్డు, చనుమోలు వెంకట్రావు బ్రిడ్జి, మిల్క్‌ప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి కొండపైకి చేరుతుంది.

దుర్గగుడిలో అన్నవితరణకు ఏలూరు జిల్లా జీలుగుమిల్లికి చెందిన అంజూరి నవీన్ కుమార్, కుటుంబసభ్యులు రూ.1,16,150లను చెక్కు రూపంలో విరాళంగా అందజేశారు.

సమష్టి కృషితో మెరుగైన సేవలందించాలి

▸▸ ఏలూరు రేంజ్ ఐజీపీ అశోక్‌కుమార్



ఐజీపీ అశోక్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణాజిల్లా ఎస్పీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 23 : సమష్టి కృషితో ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీజీ అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఏఆర్ పోలీసుల డి మొబలైజేషన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని పరేడ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సివిల్ పోలీసులు తమ విధుల్లో ప్రజలకు కనిపిస్తుంటారని, ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం ఎవరికీ కనబడకుండా విధి నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తారన్నారు. కీలకమైన బందోబస్తులు, ప్రమాదకరమైన వస్తువుల నుంచి భద్రత వంటి అంశాలను ఏఆర్ పోలీసులు నిర్వహిస్తారన్నారు. ఆయుధాల హ్యాండ్లింగ్, ఫైరింగ్, మార్చ్‌ఫాస్ట్, ఎస్కార్ట్, ప్రిజనర్స్ ఎస్కార్ట్, బందోబస్తు, ప్రథమ చికిత్స వంటి అంశాలపై మంచి తర్ఫీదు పొంది వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పోలీసు జాగిలాలు, బాంబ్ స్క్వాడ్ విన్యాసాలను ఐజీపీ తిలకించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, ఎస్పీ అడ్మిన్ జి.వెంకటేశ్వరరావు, టౌన్ డీఎస్పీ, సీఐలు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడులను అరికట్టండి : ఐజీపీకి వినతి

పాత్రికేయులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఏలూరు రేంజి ఐజీపీ జీవీజీ అశోక్‌కుమార్‌కు శుక్రవారం మచిలీపట్నం పాత్రికేయులు వినతిపత్రం సమర్పించారు. ఇటీవల రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలు ఈనాడు కార్యాలయంపై దాడులు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడి, పాత్రికేయుల హక్కులను పరిరక్షించాలని వినతిపత్రంలో కోరారు. ఏపీయూడబ్ల్యూజె నేతలు తదితరులు పాల్గొన్నారు.



రాయనపాడు మత్స్యకార సొసైటీ, ఈలప్రోలు మత్స్యకార సొసైటీ

రెండు మత్స్యకార సొసైటీలు టీడీపీ కైవశం

గొల్లపూడి/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 23 : విజయవాడరూరల్ మండలం రాయనపాడు మత్స్యకార సొసైటీని టీడీపీ గెలుచుకున్నట్టు టీడీపీ గ్రామ అధ్యక్షుడు శీలంనేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు జనసేన, సీపీఎం, సీపీఐలు మద్దతు తెలిపినట్టు సాంబశివరావు తెలిపారు. మత్స్య సొసైటీ అధ్యక్షునిగా జొన్నకూటి దుర్గారావు, ఉపాధ్యక్షునిగా మందా సుబ్బారావు, కార్యదర్శిగా బోళ్ల రమేష్‌బాబు, సభ్యులుగా పాగోలు రాములు, ఎస్.కోటేశ్వరరావు, పి.వెంకటరత్నం, మందా మాధవరావు, మందా చిన్న వెంకటేశ్వరరావు, నెమలికంటి కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు.

ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు మత్స్యకార సహకారం సంఘాన్ని టీడీపీ దక్కించుకుంది. ఎంపీపీ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షునిగా మిరియాల లక్ష్మణరావు, ఉపాధ్యక్షునిగా పిల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మండల మోహన్‌రావులతో పాటు ఆరుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మత్స్యశాఖ అధికారి బి.శ్యామ్ లెనిన్‌బాబు తెలిపారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రవీంద్ర

మహిళా గళం విజయవంతం చేయండి : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 23 : గుడివాడలో మార్చి4 వతేదీన జిల్లా స్థాయిలో జరగనున్న తెలుగు మహిళా గళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం భాస్కరపురంలో పోస్టర్లను కొల్లు రవీంద్ర, టీడీపీ కృష్ణాజిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్ర మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి చంద్రబాబు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల మానిఫెస్టోలో మహిళా శక్తి పేరుతో పలు పథకాలు పొందుపరిచారని చెప్పారు. తలశిల స్వర్ణలత మాట్లాడుతూ, జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలపై దాడులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో షైనేని ఇందిర, పాలపర్తి పద్మజ, లంకిశెట్టి నీరజ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

▸▸ జిల్లా అధికారులతో ఆర్డీవో సమీక్ష



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భవానీశంకర్

వన్‌టౌన్, ఫిబ్రవరి 23 : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరగనున్న గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు ఆర్డీవో భవానీ శంకర్ చెప్పారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. 25వ తేదీ ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, మొత్తం 24373 మంది పరీక్షలు రాయనుండగా.. 54 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో తెలిపారు. అన్నిశాఖల సమన్వయంతో ఎక్కడా అవకతవకలు జరగకుండా పరీక్షలను నిర్వహించాలన్నారు. రూట్ ఆఫీసర్‌లు, లయజన్ ఆఫీసర్‌లు, వెన్యూ సూపర్‌వైజర్‌లు వారి విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. 26 రూట్లను ఏర్పాటు చేసామని, 26 మంది సీనియర్ జిల్లాస్థాయి అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించినట్టు తెలిపారు. సెక్షన్ 144 అమలులో ఉంటుందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్‌లను మూసివేయాలన్నారు. మౌలిక సదుపాయాలు, రూమ్‌లలో ఏర్పాట్లు ముందురోజే సరిచూసుకోవాలన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులు సకాలంలో వారికి కేటాయించిన కేంద్రాల వద్దకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. 9.30 గంటలకే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందని, హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, డిజిటల్ పరికరాలు అనుమతించరాదని తెలిపారు.

గ్రూప్-2 పరీక్షకు ఏర్పాట్లు చేయండి

▸▸ కృష్ణా జేసీ గీతాంజలి శర్మ



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం జరగనున్న గ్రూప్-2 పరీక్ష ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా జేసీ గీతాంజలి శర్మ అధికారులు ఆదేశించారు. జిల్లాపరిసత్ సమావేశపుహాలులో చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ ఆఫీసర్లు, రూట్‌ఆఫీసర్లతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. జిల్లాలో 17241 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని, గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరు డివిజన్‌లో 51 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షాకేంద్రాల వద్ద తాగునీరు, ఫర్నిచర్, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచాలని, విద్యుత్‌రఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటుచేయాలన్నారు. ఏఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పరీక్షాకేంద్రాల వద్ద పటిష్టపోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో మచిలీపట్నం, ఉయ్యూరు ఆర్డీవోలు ఎం.వాణి, డి.రాజు, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ఏపీపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో జిల్లా యంత్రాంగం

▸▸ నోటిఫికేషన్ నాటికి ఓటర్ల జాబితాల స్వచ్ఛీకరణ ప్రయత్నాలు

▸▸ రాజకీయ పార్టీల నేతలతో సమీక్ష సమావేశాలు.. సత్వర చర్యలు

▸▸ పోలింగ్ సిబ్బంది ఎంపిక, శిక్షణ, ఓటర్ల నమోదులపైనా బిజీ బిజీ



రాష్ట్ర ఎన్నికల అధికారి మీనాతో వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్, కమిషనర్ స్వప్నిల్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మార్చి రెండో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లకు సంసిద్ధమౌతోంది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందుగా రాజకీయ పార్టీల నుంచి వస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఓటర్ల స్వచ్ఛీకరణ ప్రక్రియను నూరుశాతం పూర్తి చేయాలని భావిస్తోంది. తుది ఓటర్ల జాబితాలను విడుదల చేసినప్పటి నుంచి ఈ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీల నేతలతో జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. సూక్ష్మస్థాయిలో ఓటర్ల జాబితాలను పరిశీలిస్తూ తమ దృష్టికి వచ్చిన వాటిని కలెక్టర్ దృష్టికి, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకు వెళ్లటం జరుగుతోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వాటిని ప్యూరిఫికేషన్ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) అనంతరం వెలుగు చూసిన ఫిర్యాదులపైనా ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తఓటర్ల నమోదుకు జిల్లా యంత్రాంగం స్వీప్ వంటి కార్యక్రమాల ద్వారా విస్తృత అవగాహన ద్వారా ప్రయత్నాలు జరిపింది. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన అంశాలపైనా దృష్టి సారించారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణతో పాటు, ఎలక్షన్ గోడౌన్ల తనిఖీలు, వీవీప్యాట్‌ల పరిశీలనలు క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1781 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల ఓటర్ల సౌలభ్యాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని పోలింగ్ కేంద్రాలను పెంచటం జరిగింది. బ్యాలెట్ యూనిట్స్, సెంట్రల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ వంటివి ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా ఉండటంతో పాటు, 25 శాతం మేర రిజర్వులో ఉన్నాయి. పోలింగ్ నిర్వహణకు సిబ్బంది ఎంపిక ప్రక్రియను దాదాపుగా సిద్ధం చేసుకోవటం జరిగింది. జిల్లా పరిధిలో ఎనిమిది మంది రిటర్నింగ్ ఆఫీసర్లు, 44 మంది సహాయ రిటర్నింగ్ అధికారులు, ఏడు ఈఆర్‌వోలు, 36 ఏఈఆర్‌వోలు, 169 మంది సెక్టార్ ఆఫీసర్లు, 169 మంది సెక్టార్ పోలీస్ ఆఫీసర్స్, 2137 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్స్, 10866 మంది పోలింగ్ ఆఫీసర్స్, 1863 మంది బీఎల్‌వోలు, 16 మంది నోడల్ ఆఫీసర్లకు సరిపడా ఇప్పటికే పోలింగ్ సిబ్బందిని ఎంపిక చేయటం జరిగింది. వీరితో పాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి 6200 మంది పోలీసు బలగాలు అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ ప్రాంతాలపై ఇప్పటికే దృష్టి సారించారు. సరిహద్దు ప్రాంతాలపై నిఘా ఉంచారు. దాదాపుగా జిల్లా యంత్రాంగం పూర్తిగా ఎన్నికల విధుల్లో తలమునకలుగా ఉంది.

తెలుగుయువత నేతపై వైసీపీ మూక దాడి

▸▸ మొక్కు తీర్చుకునే ఏర్పాట్లలో వుండగా.. పిలిచి చితకబాదారు

▸▸ టీడీపీ కార్యకర్తల మధ్య గొడవగా సోషల్ మీడియాలో రివర్స్ ట్రోల్స్

విజయవాడ/హనుమాన్‌జంక్షన్ రూరల్, ఫిబ్రవరి 23 : గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు మండలంలో టీడీపీ శ్రేణులే లక్ష్యంగా భౌతికదాడులకు వైసీపీ తెగబడుతోంది. బాపులపాడు తెలుగు యువత అధ్యక్షుడు చెరుకూరి హరికృష్ణను ముక్కు, మొహం పగిలేలా చితకబాదిన ఘటన గురువారం అర్ధరాత్రి గ్రామంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరు రోడ్డులో నివసిస్తున్న చెరుకూరి హరికృష్ణకు ఇటీవలే ఆడపిల్ల పుట్టింది. ఆదివారం మొక్కుబడులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేసుకుని గురువారం తిరిగి ఇంటికి వస్తుండగా బాపులపాడు సూరమ్మచెరువు వాటర్‌ట్యాంకు వద్ద గూడవల్లి జగదీష్, గూడవల్లి సత్యనారాయణ తదితరులు పిలిచారని తెలిపారు. ఎందుకు పిలిచారని అడగ్గా సంగ్రామ్‌పై దాడి చేసిన పోతుమర్తి హేమంత్ అలియస్ బాబి కేసు ఎందుకు పెట్టించావని, వాడ్ని కొడితే నువ్వు కాపాడతావా అంటూ ఇప్పుడు నిన్ను కొడితే ఎవడు కాపాడతాడంటూ దుర్భాషలాడుతూ ముఖంపై పిడిగుద్దులు గుద్దుతూ బైక్‌పై ఉన్న తనను కిందపడేసి కాళ్లతో తన్నారని బాధితుడు వివరించారు. పెనుగులాటలో తన జేబులో ఉన్న 10 వేల రూపాయలు, బుల్లెట్ తాళం కనబడలేదని, కుటుంబసభ్యుల సాయంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా డాక్టర్ ఓపీలో ఉంచి వైద్యం చేస్తున్నారని బాధితుడు పోలీసులకు ఇచ్చిన వాగ్మూలంలో పేర్కొన్నాడు. ఘటనలో హరికృష్ణ ముఖంపైనా, నోటిపైనా, కంటిలో రక్తం వచ్చేలా కొట్టారని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

సోషల్‌మీడియాలో రివర్స్‌ట్రోల్స్

ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే టీడీపీకి చెందిన యువకుల మధ్య చెలరేగిన ఘర్షణను వైసీపీకి అంటించి బురదజల్లుతున్నారంటూ సోషల్‌మీడియాలో రివర్స్‌ట్రోల్స్ పెట్టారని టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం సేవిస్తుండగా తమ వద్దకు వచ్చి హరికృష్ణ రెచ్చగొట్టాడని, అందుకే చేయి చేసుకోవాల్సి వచ్చిందంటూ రివర్స్ కేసు పెట్టేందుకు ప్రయత్నించడంతో పాటు పబ్లిక్ ప్రాంతాల్లో మద్యం సేవిస్తూండగా జరిగిన గొడవగా కేసును నీరుగార్చేందుకు అధికారపార్టీ వారు ప్రయత్నిస్తున్నారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కౌంటర్ కేసు నమోదు

వైసీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన చెరుకూరి హరికృష్ణ ఫిర్యాదుపై జంక్షన్ ఎస్సై జనార్దన్ శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హరికృష్ణ ఫిర్యాదుపై దాడికి పాల్పడిన వైసీపీ కార్యకర్తలు గూడవల్లి జగదీష్, గూడవల్లి సత్యనారాయణపై సెక్షన్ 324 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా నిందితులు ఇచ్చిన కౌంటర్ ఫిర్యాదుపై కూడా హరికృష్ణ మీద సెక్షన్ 324 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. హరికృష్ణపై దాడికి పాల్పడిన నిందితులు గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కౌంటర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



డాక్టర్‌తో మాట్లాడుతున్న జడ్పీటీసీ

తీరు మార్చుకోకపోతే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తా

▸▸ జడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ

కోడూరు, ఫిబ్రవరి 23 : రోగుల విషయంలో పనితీరు మార్చుకోకపోతే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని జడ్పీటీసీ సభ్యులు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కోడూరు శివారు స్వతంత్రపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యం చేయించుకోవటానికి వచ్చిన రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది సక్రమంగా నడుచుకోవటం లేదని, గత కొద్ది రోజులుగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో సరైన పద్ధతితో నడుచుకోవటం లేదని పలువురు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. దెబ్బలు తగిలిన రోగులు కట్టుకట్టమంటే వారిని కూడా చిన్న చూపు చూస్తున్నారని, మీ పద్ధతి ఇలాగే కొనసాగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

భౌతికదాడులు అమానుషం

▸▸ యార్లగడ్డ వెంకట్రావు, చలమలశెట్టి రమేశ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న మీడియాపై, టీడీపీ శ్రేణులపై భౌతికదాడులకు దిగడం అమానుష చర్య అని టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాపులపాడు తెలుగు యువత అధ్యక్షుడు చెరుకూరి హరికృష్ణను శుక్రవారం జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబుతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా హరికృష్ణపై దాడిచేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోకపోతే విపత్కరపరిస్థితులు ఎదుర్కొనాల్సివస్తుందని చలమలశెట్టి రమేశ్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరం నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, అరాచకశక్తులు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. జిల్లా ఎస్పీకి ఫోన్ ద్వారా సమాచారం అందించిన యార్లగడ్డ బాధితుడి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేశ్, మూల్పూరి సాయికళ్యాణి, అట్లూరి శ్రీనివాస్, గార్లపాటి రాజేశ్వరరావు, తెలుగుయువత నాయకులు తదితరులు హరికృష్ణను పరామర్శించారు.



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న హరికృష్ణను పరామర్శిస్తున్న టీడీపీ, జనసేన నేతలు

తప్పుడు నివేదికలకు మూల్యం తప్పదు

ఇసుక మాఫియాకు సహకరించిన కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు

▸▸ నెట్టెం రఘురాం ఆరోపణ

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 23 : ఇసుక మాఫియాకు సహకరిస్తూ ఎన్జీటీకి తప్పుడు నివేదికలు ఇచ్చిన కృష్ణా, గుంటూరు జిల్లా కలెక్టర్లు మూల్యం చెల్లించక తప్పదని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. జగన్ రెడ్డి తన అక్రమాలకు సహకరించేందుకు గనులశాఖ డైరెక్టర్,ఏపీఎండీసీ ఎండీగా వెంకటరెడ్డిని నియమించుకుని వేలకోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. ఆయన శుక్రవారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ బృందానికి కనబడిన ఇసుక దందా జిల్లా కలెక్టర్లకు కనపడకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. పలుసార్లు ఇసుక దందాపై ఎన్జీటీ ప్రభుత్వానికి గనులశాఖకు లేఖలు రాసినా ఏమీలేదని తోసిపుచ్చటం దారుణమన్నారు. వైఎస్ ప్రభుత్వ హయాంలో ఐఏఎస్‌లు తప్పుడు పనులు చేసి కోర్టులో దోషులుగా తిరుగుతున్నారని, అయినా జిల్లా అధికారులు గుడ్డిగా నివేదికలు ఇవ్వటం దుర్మార్గమని, ఇప్పటి వరకు టీడీపీ ఆరోపణలు కొట్టివేసిన జగన్‌రెడ్డి ఇప్పుడేమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి అరాచకాలకు, సహకరించిన వారు భవిష్యత్‌లో మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఆయన వెంట పార్టీ నేతలు ముల్లంగి రామకృష్ణారెడ్డి, కన్నెబోయిన రామలక్ష్మి, మేకా వెంకటేశ్వర్లు, కట్టా నరసింహారావు, గింజుపల్లి రమేష్, అన్వర్, శ్రీనివాసరావు, కర్రి చిన్నా తదితరులు ఉన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న నెట్టెం రఘురాం తదితరులు



రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు కృష్ణా జిల్లా జట్లు

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు కృష్ణా జిల్లా జట్ల ఎంపిక

గుడివాడ, ఫిబ్రవరి 23 : సామర్లకోటలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు కృష్ణాజిల్లా జట్లను ఎంపికచేసినట్టు రాష్ట్ర అసోసియేషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. కోచ్ మేనేజర్లుగా కె.అనురాధ, ఎన్.సుధీర్, పి.ఎస్ సోమేశ్వరరావు, డి.రాజ్‌కుమార్‌లు వ్యవహరించనున్నారు.

మహిళల జట్టు: కె.కుమారి, టి.ఝాన్సీరాణి, కె.చైతన్య అఖిల, ఎం.దుర్గాభవాని, బి.మౌనిక, బి.నాగసుశీల, జి.దీప్తి, ఎ.దేవి, హురున్నీసా, ఎం.లావణ్య, బి.శివ స్వప్న, ఎన్.ధనలక్ష్మి, జి.అనిత, డి.చరితశ్రీ, కె.ఊర్మ్య, అభిజ్ఞ.

పురుషుల జట్టు: కె.కొండలరావు, బి.వినయ్, టి.తిమోతి, సీహెచ్ అజయ్‌కుమార్, జి.హస్మల్, సీహెచ్ గణేష్, రాకేష్, జె.నాగేశు, డి.షణ్ముఖ శ్రీనివాస్, ఆసిఫ్ ఖాన్, కె.జగదీష్, కె.జయసూర్యతేజ, పి.అభిషేకం, డి.దుర్గాప్రసాద్, సీహెచ్ రేవంత్‌కుమార్, యు.నాగరాజు, గణేషనాయుడు, భరత్‌కుమార్.

వైసీపీకి కంచికచర్ల ఎంపీటీసీ గుడ్‌బై



కంచికచర్ల రూరల్, ఫిబ్రవరి 23 : నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ జగన్ మమ్మల్నే మోసం చేస్తున్నాడని వైసీపీని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు వీడుతున్నారు. కంచికచర్ల ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై ఇతరులు పెత్తనం చేస్తూ అవమానిస్తున్నారని, తనకు తెలియకుండానే వలంటీర్లను నియమించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విలువ, గౌరవం లేని పార్టీలో కొనసాగటం అవమానకరంగా భావిస్తూ వైసీపీని వీడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగులకు జాబ్‌మేళా

వన్‌టౌన్ : దివ్యాంగులకు ఈనెల 26వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్టు గ్రో (జీఆర్‌ఓ) సంస్థ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన 18 నుంచి 34 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగులు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. వివరాల కోసం 7331149646లో సంప్రదించవచ్చన్నారు.



భోజనం వడ్డిస్తున్న టీడీపీ నేతలు

జగ్గయ్యపేట అన్నా క్యాంటీన్‌కు 600 రోజులు

▸▸ దిగ్విజయంగా పేదల ఆకలి తీరుస్తున్న అన్నపూర్ణ

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 23 : జగ్గయ్యపేటలో అన్నా క్యాంటీన్ 600 రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో పట్టణంలో విజయవాడ రోడ్డులో పాత అన్నా క్యాంటీన్‌కు సమీపంలో ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఉండటంతో మంచి ఆదరణ లభిస్తున్నది. కనీసం రోజుకు 1000 మంది ఆహారం స్వీకరిస్తున్నారు. శ్రీరాం తాతయ్య ప్రత్యేక శ్రద్ధ వహించి పర్యవేక్షిస్తున్నారు. దాతల నుంచి స్పందన లభిస్తున్నది. దివ్యాంగులు, అనాధలు, వృద్ధులకు ఆహార పొట్లాలను వారి ఇళ్ల వద్దకే అందిస్తున్నారు.



అన్న క్యాంటీన్‌లో ఆహారం స్వీకరిస్తున్న పేదలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

నేడు పాణుకుమాడులో జీవధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ



ఉంగుటూరు, ఫిబ్రవరి 23 : మండలంలోని పాణుకుమాడు రాజేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో శనివారం ఉదయం జీవధ్వజ, ద్వారపాలక, కాలభైరవ, బలిపీఠం ప్రతిష్ఠామహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) తెలిపారు. ఇందులో భాగంగా మూడురోజుల (త్రయాహ్నిక) దీక్షతో దాతలు సుంకర రాజేంద్రప్రసాద్, పద్మజ, రవి, శ్రీదేవి, రాజేష్, పద్మావతి దంపతులచే ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, క్రతువులు, నియమ, నిష్ఠలతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. .

వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడిద్దాం

• మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరులో ప్రచారం చేస్తున్న బోడె ప్రసాద్, తదితరులు

పెనమలూరు, ఫిబ్రవరి 23 : తన దురహంకార పాలనతో రాష్ట్రాన్ని కనీసం ముప్పైఏళ్లు వెనక్కి నెట్టిన సైకో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడిద్దామని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం పెనమలూరు ఎల్‌ఎన్ గార్డెన్స్ శ్రీహరి గార్డెన్స్‌లో జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానికులతో మాట్లాడారు. రాష్ట్రంలోని మైనారిటీలు, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరినీ మోసం చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోతాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దెనెక్కిన తొలినాళ్లలోనే సరైన ఇసుక పాలసీ తేకపోగా కొన్నివేల మంది భవన నిర్మాణ కార్మికుల చావుకు కారణమయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, సంగెపు రంగారావు, తుమ్మలపల్లి ఆంజనేయులు, కిలారు శ్రీనివాస్, సుబ్బారావు, అరవపల్లి శివప్రసాద్, బుజ్జి, సలీం, చిగురుపాటి మల్లయ్య పాల్గొన్నారు.

కానూరులో..

వచ్చే ఎన్నికల నాటికి టీడీపీ మరింత బలోపేతమై వైసీపీ ఖాళీ అవుతుందని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కానూరులో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన స్థానికులతో ఆయన మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీని బలపరిచి రాష్ట్రాన్ని బాగు చేసుకుందామని పేర్కొన్నారు. టీడీపీలోకి గ్రామానికి చెందిన పిన్నబోయిన రవిశంకర్ మరో ఏభై మంది వైసీపీ కార్యకర్తలు తమ కుటుంబాలతో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, షేక్ బుజ్జి, పీతా గోపీచంద్, సంగెపు రంగారావు, అంగిరేకుల మురళి పాల్గొన్నారు.



యనమలకుదురులో బోడె హేమ పాదయాత్ర

యనమలకుదురులో..

యనమలకుదురు ఇందిరానగర్ కట్ట వద్ద జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బోడె ప్రసాద్ సతీమణి హేమ ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని బలపరిచి బోడె ప్రసాద్‌ను ఎమ్మెల్యేగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. ఆమె వెంట అనంతనేని ఆజాద్, ముక్కపాటి శ్రీనివాస్, సంపర శేఖర్, తమ్ము అశోక్, ప్రభాకర్, బలగం నాగరాజు, కిలారు శ్రీనివాస్, పండుల రజిని పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

సీఐటీయూ నాయకులు



పోరంకిలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పెనమలూరు, ఫిబ్రవరి 23 : ఢిల్లీలో రైతులు చేసిన ఉద్యమానికి దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, కేంద్ర ప్రభుత్వ సారథి మోదీని గద్దె దింపాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పోరంకి సెంటర్లో జరిగిన రైతుల సంఘీభావ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు అమర శాస్త్రి మాట్లాడుతూ, రైతులను, కార్మికులను మోసం చేసిన ఏ ప్రభుత్వం బతికి బట్ట కట్టలేదని, ఇప్పటికైనా రైతులకిచ్చిన మాట మీద కేంద్రప్రభుత్వం నిలబడాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ, గతంలో ఢిల్లీ శివారుల్లో ఆందోళన చేసిన రైతులకు మోదీ ప్రభుత్వం మాటిచ్చి తప్పిందని, దీంతో చేసేదేమీలేక తిరిగి రైతులు శాంతియుతంగా ఆందోళన చేపడితే వారిని పొలిమేరల్లో అడ్డుకొని బాష్పవాయుగోళాలు, వాటర్‌గన్‌లను ప్రయోగించడం, ఒక యువరైతు ఉసురు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పుసులూరి పాతాళలక్ష్మి, సీహెచ్ భవాని, దిశ సరళమ్మ, పోతులూరి శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, వాడపల్లి శ్రీరాములు, సత్యనారాయణ, సింహాచలం, నరసయ్య పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 23 : స్థానిక ఏపూరు దాసాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో 45 అడుగుల విగ్రహం ప్రతిష్ఠించి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని 25 అడుగుల గజమాలతో అలంకరించారు. అభిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు.

అంకమ్మతల్లి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అంకమ్మతల్లి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 23 : బిళ్లనపల్లిలో అంకమ్మతల్లి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అర్చకులు వేణుశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం మేళతాళాల మధ్య అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మవారికి మహిళలు వారపోసిహారతులతో స్వాగతం పలుకుతూ చీర, పసుపు కుంకుమ సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు కొండ పావులూరి వెంకట బాబూరావు, తులసీరాం ప్రసాద్, హేమంత్‌కుమార్, మోహన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా సోమేశ్వరస్వామి కల్యాణం



శివాలయంలో స్వామివారి కల్యాణోత్సవం

ఉయ్యూరు, ఫిబ్రవరి 23 : ఉయ్యూరులో జరుగుతున్న జగదాంబ సమేత సోమేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పంచాహ్నిక దీక్షతో శావాగమ సంప్రదాయంలో ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవం నయన మనోహరంగా జరిగింది. దేవస్థాన పాలక మండలి చైర్మన్ చిందా వీర వెంకట కుటుంబారాజు త్రివేణి ఝాన్సీరాణి దంపతులు కల్యాణ క్రతువును అర్చకుల సూచనలతో నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 23 : విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా శనివారం హనుమాన్ జంక్షన్ సబ్‌స్టేషన్ పరిధిలోని బాపులపాడులో విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. హనుమాన్‌నగర్, వేలేరు అడ్డరోడ్డు, రాజుల కాలనీ, కెఎస్ టాకీస్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు పేర్కొన్నారు.

వీకేఆర్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

గుడివాడ : క్రీడలు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదం చేస్తాయని వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండ రామయ్య పేర్కొన్నారు. రెండు రోజులు పాటు జరిగే వీకేఆర్ స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులకు క్రీడాపరికరాల కిట్‌లను అందజేశారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారమ్స్, త్రోబాల్, షాట్‌పుట్, క్రికెట్, టెన్నికాయిట్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. కళాశాల డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు, స్పోర్ట్స్ మీట్ సమన్వయకర్త డాక్టర్ విఘ్నేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాతో కోట్లు దోచేస్తున్న మంత్రి జోగి

● ఎన్నికల్లో విచ్చలవిడి ఖర్చుకు రూ. 200 కోట్లు సిద్ధం

● మంత్రిపై టీడీపీ నేత తుమ్మలపల్లి హరికృష్ణ మండిపాటు

కంకిపాడు, ఫిబ్రవరి 23 : పర్యావరణ శాఖ అనుమతులు లేకుండా మంత్రి జోగి రమేశ్ ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా చేసి కోట్లు దోచేస్తున్నాడని, ఆ సొమ్ముతో ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చుపెట్టేందుకు సిద్ధమయ్యాడని టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల పరిధిలోని ఇసుక క్వారీల నుంచి ఇసుక అక్రమ తరలింపునకు అధికార పార్టీ నాయకులు ఎగబడుతున్నారన్నారు. ఇసుక అక్రమ రవాణాతో వచ్చిన రూ. 200 కోట్లతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బరిలో దిగేందుకు మంత్రి జోగి సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు. ఇంకా నిధుల సమీకరణలో ఉన్న మంత్రికి పేదల సమస్యలు పట్టడం లేదన్నారు. కరకట్ట ప్రాంతంలో పేదలకు కేటాయించిన ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను పక్కనే ఉన్న క్వారీల ద్వారా పంపిణీ చేయడం లేదని, ఉయ్యూరు మార్కెట్ యార్డ్‌లోని స్టాక్ పాయింట్‌కు కేటాయించారని, అక్కడ నుంచి లబ్ధిదారులు ట్రాక్టర్ ఖర్చు రూ. 2500, లోడింగ్‌కు రూ.500 చెల్లించాల్సి వస్తోందన్నారు. ఈ సమా వేశంలో పార్టీ మండల కార్యాలయ బాధ్యుడు బొప్పూడి శివ రామకృష్ణ, పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్, షేక్ బాజీ, జనసేన పార్టీ నాయకులు బాబు తదితరులు పాల్గొన్నారు.

అత్తను హత్య చేసిన అల్లుడికి జీవిత ఖైదు

పెనమలూరు, ఫిబ్రవరి 23 : మద్యం మత్తులో భార్యను గొడ్డలితో నరకడానికి యత్నిస్తున్న అల్లుడును అడ్డుకోబోయిన అత్త అల్లుడి చేతిలో హతమైన ఘటనలో నిందితుడికి విజయవాడ కోర్టు జీవిత ఖైదు విధించింది. పోలీసుల వివరాల మేరకు.. ఆరేళ్ల క్రితం పెనమలూరు మండలం వణుకూరు సాయిపురం కాలనీకి చెందిన కన్నా శశిరేఖ తన తల్లి కొక్కిలిగడ్డ శివలీలను ఆసుపత్రికి తీసుకెళ్లడానికి తీసుకొచ్చింది. అప్పటికే మద్యం సేవించి ఉన్న భర్త జేజి ప్రసాద్ భార్య శశిరేఖతో ఘర్షణకు దిగాడు. కోపం పట్టలేక ఇంట్లో ఉన్న గొడ్డలితో భార్యను నరకబోయాడు. అత్త శివలీల అడ్డుకోవడంతో ఆమెను నరికేశాడు. అత్త అక్కడికక్కడే మృతి చెందిం ది. భార్య శశిరేఖ ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ దామోదర్ తన సిబ్బందితో కలిసి జేజి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. కేసు విచారించిన విజయవాడ ఏడవ అడిషనల్ న్యాయస్థానం న్యాయమూర్తి ఎస్ నాగేశ్వరరావు గురువారం నిందితుడు జేజి ప్రసాద్‌కు జీవిత కాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు.

పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ రంగులను తొలగించాలి



ఎన్నికల అధికారి చంద్రలీలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గన్నవరం, ఫిబ్రవరి 23 : గన్నవరం నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వైసీపీ రంగులను తొలగించి పెండింగ్‌లో ఉన్న ఓటర్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ల గోపాలకృష్ణ ఎన్నికల అధికారులకు వినతిపత్రం సమర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.చంద్రలీల అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా చంద్రలీల మాట్లాడుతూ, జనవరి 22న నియోజకవర్గంలో ప్రకటించిన ఓటర్ల తుది జాబిత ప్రకారం 2,77,323 లక్షల మంది ఓటర్లు ఉండగా కొత్తగా 1942 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారని మొత్తం 2,79,265 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. తొలగింపులకు సంబంధించి ఫారం-7 దరఖాస్తులు 2015, మార్పులకు సంబంధించి ఫారం-8 దరఖాస్తులు 1096, కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి ఫారం-6 232 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ, నాలుగు మండలాల్లో జడ్పీ, ఎంపీపీ పాఠశాలల భవనాల్లో చాలా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అధికార పార్టీ నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా వైసీపీ రంగులు, సీఎం జగన్ ఫొటోలతో నింపేశారని భారత ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల ప్రకారం ఆ రంగులను తొలగించి గతంలో పాఠశాల భవనాలకు ఉన్న ఆమోదింపబడిన రంగులని వేయాలని కోరారు. ఇప్పటికే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ దృష్టికి తీసుకొచ్చారన్నారు. తహసీల్దార్ ఎన్ఎస్‌పీ కుమార్, ఎలక్షన్ డీటీ ఏఎస్ఆర్ గోపాల్‌రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులు వింతా సంజీవరెడ్డి, నాదెండ్ల మోహన్, గణేష్‌బాబు, కళ్లం వెంకటేశ్వరరావు తంగిరాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు పోటెత్తుతున్న భక్తులు



ఉయ్యూరు, ఫిబ్రవరి 23 : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పోటెత్తుతున్నారు. తిరునాళ్లలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకునేందుకు ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వస్తున్నారు. పదిహేను రోజులపాటు జరిగే తిరునాళ్లలో శుక్రవారం పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొట్టేళ్లు, కోడిపుంజుల, చీర, సారె, డప్పువాయిద్యాలతో అమ్మ వారిని దర్శించి మొక్కు చెల్లించుకుంటున్నారు. శనివారం మాఘపౌర్ణమి కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వస్తారన్న అంచనాతో ఆలయ కమిటీ, అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. వీరమ్మ తిరునాళ్లలో భక్తులకు ప్రసాదం, తాగునీరు అందజేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు ముందుకు రావడం అభినందనీయమని ఉయ్యూరు పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్ అన్నారు. మహలక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ అధినేత వెంట్రప్రగడ శేషు ఆధ్వర్యంలో శుక్రవారం భక్తులకు ప్రసాదం పంపిణీ ప్రారంభించారు. శేషు, నాగరాజు పాల్గొని సేవలందించారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

గన్నవరం, ఫిబ్రవరి 23 : పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో వార్షిక కల్యాణ మహో త్సవం అంగరంగ వైభవంగా శుక్రవారం రాత్రి జరిగింది. ఉదయం అఖండ దీపారాధనతో కళ్యాణ వేడుకలు ప్రారంభమ య్యాయి. అనంతరం అమ్మవారికి, స్వామివారికి కంకణధారణ, మానుపూజ, గ్రామ పొంగళ్లు సమర్పించారు. సాయంత్రం శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవ మూర్తులను కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. పలువురు దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించగా సుముహూర్తం లో వేద పండితులు శాస్త్రోక్తంగా అమ్మవారి కల్యాణాన్ని జరిపారు. మాజీ ఎంపీ మాగంటి బాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు తదితర ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పెళ్లి కుమార్తెగా అలంకరింపబడిన లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారిని యార్లగడ్డ వెంకట్రావు, మాగంటి బాబులు కల్యాణ వేదికపై ఉన్నగోపయ్యస్వామి వద్దకు తీసుకువెళ్లారు. పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ పర్యవేక్షణలో అన్న సంతర్పణ నిర్వహించారు.



కల్యాణోత్సవంలో పూజలు చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు, మాగంటి బాబు

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

బీజేపీ రాష్ట్ర నాయకుడు కిలారు దిలీప్

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 23 : వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, రాష్ట్ర సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు మద్దతుగా నిలవాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కిలారు దిలీప్ కోరారు. వికసిత భారత్ సంకల్పయాత్రలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నిర్వహిస్తున్న నియోజకవర్గ ప్రజాపోరు యాత్ర శుక్రవారం హనుమాన్ జంక్షన్‌లో ప్రారంభించారు. ముందుగా బీజేపీ నాయకులు స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లోను ముందుం జలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొర్రపోలు శ్రీనివాసరావు, శేషుకుమార్, విద్యాసాగర్, సింగవరపు భాస్కర్, తోట మురళీధర్, బాపులపాడు మండల అధ్యక్షుడు జింకా నలగామరాజు, బాపులపాడు గ్రామ అధ్యక్షుడు కొసరాజు వేణుగోపాలరావు, ఎదురువాడ శ్రీనివాసరావు, అప్పలరాజు, విజయవాడ రూరల్ మండల అధ్యక్షురాలు సర్నాల విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.



జంక్షన్ సెంటర్‌లో మాట్లాడుతున్న బీజేపీ నేత కిలారు దిలీప్





కొండాలమ్మ సేవలో డీఐజీ అశోక్‌కుమార్

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 23 : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి అశోక్ కుమార్ శుక్రవారం దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం డీఐజీని శాలువతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు ఆలయ పాలక మండలి చైర్మన్ శేషం వీరవెంకట కృష్ణ మూర్తి, ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



భోగిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర



గుడివాడలో పర్యటిస్తున్న వెనిగండ్ల, రావి



టీడీపీలో చేరిన వారితో కాగిత కృష్ణప్రసాద్

అవినీతి వైసీపీ పాలకులను తరిమికొట్టండి

బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో కొల్లు రవీంద్ర, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, కుమార్ రాజా పిలుపు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 23 : అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీ పాలకులను రానున్న ఎన్నికల్లో తరిమికొడదామని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. భాస్కరపురం, నోబుల్ కాలనీ, భోగిరెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో శుక్రవారం కొల్లు రవీంద్ర విస్తృతంగా ఇంటింటికీ పర్యటించారు. వైసీపీ వైఫల్యాలను ఎండగట్టారు. నగరం టీడీపీ హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. టీడీపీ పాలనలోని అభివృద్ధి పథకాలకు వైసీపీ రంగులు పూసుకున్నారన్నారని దుయ్యబట్టారు. తన హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఇప్పటి వరకు పంపిణీ చేయలేదన్నారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, రూరల్ టీడీపీ అధ్యక్షుడు కుంచే నాని, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** పంచవటి కాలనీ, 20వ వార్డు ఆర్‌టీసీ కాలనీలో శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాస రావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి, జనసేన పట్టణాధ్యక్షులు దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాసరావు, నాయకులు లింగం ప్రసాద్, ముళ్ళపూడి రమేష్, వాసే మురళీ, గుత్తా చంటి, రాధాకృష్ణ, కంచనపల్లి సుబ్రహ్మణ్యం, యార్లగడ్డ ప్రసాద్, శొంఠి రామకృష్ణ, సత్యసాయి, సూరిబాబు, రఫీ, గుడివాడ జోన్స్, కొడాలి రామరాజు, నందకిషోర్, కనకాంబరం, అజిత్ చౌదరిచ జానీ షరీఫ్, సైదులు, రాహుల్, సుజాత, గోపాలకృష్ణ, గాంధీ, దేవేంద్రుడు, వై.శ్రీనివాసరావు, కొదమల గంగాధర్, సాయన రాజేష్, వాసా నవీన్, సాయికృష్ణ పాల్గొన్నారు.



చల్లపల్లి : మండల టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నాదెళ్లవారిపాలెంలో నిర్వహించారు. జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోర్ల శివ, గ్రామ పార్టీ అధ్యక్షుడు మాతంగి వేణు, ఎంపీటీసీ సభ్యురాలు రాజులపాటి అంకమ్మ, గ్రామ పెద్దలు నాదెళ్ల నరసయ్య, తెలుగుయువత నాయకులు రాజులపాటి జగదీష్, జంపాన వెంకటేష్, తాత అజయ్, జంపాన సాయి, వీరంకి గోపిచంద్ పాల్గొన్నారు.



సత్రంపాలెంలో బాబు ష్యూరిటీ పత్రాలు ఇస్తున్న కొల్లు నీలిమ



మహిళా గళం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కాగిత, స్వర్ణలత

జగన్‌కు మహిళలు బుద్ధి చెప్పాలి

● కొల్లు నీలిమ పిలుపు

మచిలీపట్నం టౌన్ : మద్యపానం నిషేధిస్తామని చెప్పి మాటతప్పిన జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో మహిళలు తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ పిలుపునిచ్చారు. బందరు మండలం తాళ్ళపాలెం, సత్రంపాలెం, గిరిపురం, బందరు కోటలో శుక్రవారం బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో విస్తృతంగా పర్యటించారు. నలుగురు దివ్యాంగులకు ఉచితంగా కొల్లు నీలిమ వీల్‌చైర్లు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి ప్రజలు మద్దతు తెలిపి చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలన్నారు. లంకే హరికృష్ణ, లంకే నారాయణ ప్రసాద్, తిరుమాని నారాయణ, కొల్లు హేమంత్, చక్కా గోవిందరాజులు, కొనకళ్ళ నాగరాజు, బచ్చుల అనిల్‌కుమార్, మోకా నెలబాలుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా గళం విజయవంతం చేయాలి

బంటుమిల్లి : టీడీపీ, జనసేన మహిళా కమిటీల ఆధ్వర్యంలో మార్చి 4వ తేదీన గుడివాడలో జరగనున్న మహిళా గళం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెడన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత పిలుపునిచ్చారు. మేనిఫెస్టోలో మహాశక్తి పేరిట మహిళలకు పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. ఇందిరా, పద్మజ, కరుణజ్యోతి, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి జాడలేదు : కుమార్‌రాజా

కృష్ణాపురం(పమిడిముక్కల) : వైసీపీ ఐదేళ్ల పాలనలో అరాచకాలు, అవినీతి తప్ప అభివృద్ధి జాడ లేద ని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజా విమర్శించారు పల్లెబాటలో 19వ రోజు శుక్ర వారం కృష్ణాపురం, అగినపర్రు, మామిళ్ళపల్లి, పెనుముత్స గ్రామాల్లో పర్యటించారు. వైసీపీ పాలనలో పడుతున్న కష్టాలు, సమస్యలు ప్రజలు ఏకరువు పెట్టి టీడీపీ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నామన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కొల్లూరి బాబ్జీ, మోటూరి వెంకటసుబ్బయ్య, రాజులపాటి రాంగోపాల్‌వర్మ, మండవ పూర్ణ, బొబ్బా ప్రకాశ్, వినోద్, చిగురుపాటి కిషోర్, దండమూడి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కాగిత సమక్షంలో టీడీపీలో చేరిక

పెడన రూరల్ : వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ విమర్శించారు. గూడూరు మండలం యాదవ లేళ్ళగరువు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కుంభం వెంకటేశ్వరరావు, మాగంటి సోమయ్య, వీర నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, లంకపల్లి నాగరాజు తదితర కుటుంబాలకు చెందిన 20 మంది కాగిత సమక్షంలో టీడీపీలో చేరారు. సాదరబోయిన ఏడుకొండలు, పోతన స్వామి, గోపి నాగబాబు, ఎస్‌ఎ బేగ్, హన్ను, కాసగాని శ్రీనివాసరావు, సిరివెళ్ళ శ్రీను, కాట్రగడ్డ సత్యన్నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు వస్తేనే యువతకు మేలు

పెడన : చంద్రబాబు వస్తేనే పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందని, పరిశ్రమలు వస్తాయని, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి కృష్ణప్రసాద్ అన్నారు. గూడూరు మండల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఫై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తును , భావి తరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువ ఓటర్లు చంద్రబాబుకు ఓటు వేయాలన్నారు. పోతన స్వామి, సాదరబోయిన ఏడుకొండలు, గోపీ నాగబాబు, ఎస్‌ఏ బేగ్, దాసరి కరుణజ్యోతి, సిరివెళ్ళ శ్రీనివాసరావు, కట్టా జైస్వామి, శాయన సోమయ్య, సయ్యద్ రఫీ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేర్నికి రాజకీయ పరాభవం తప్పదు

మచిలీపట్నం టౌన్ : రానున్న ఎన్నికల్లో పేర్ని కుటుంబానికి రాజకీయ పరాభవం తప్పదని, ఓటమి భయంతో కొల్లు రవీంద్రపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు అభివృద్ధి కార్యక్రమాలు పేర్నికి గుర్తుకొచ్చా యా అని బాబాప్రసాద్ ప్రశ్నించారు. 14 బెర్తులతో నిర్మించాల్సిన పోర్టును 4 బెర్తులకు కుదించి పేర్ని నాని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. నగర పార్టీ అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమ తాకీర్తి, సుధాకర్, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న వీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి కోదండ రామయ్య

వీకేఆర్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

గుడివాడ : క్రీడలు శారీరక, మానసిక ఎదుగదలకు దోహదం చేస్తాయని వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య పేర్కొన్నారు. రెండు రోజులు పాటు జరిగే వీకేఆర్ స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులకు క్రీడాపరికరాల కిట్‌లను అందజేశారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారమ్స్, త్రోబాల్, షాట్‌పుట్, క్రికెట్, టెన్నికాయిట్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. కళాశాల డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు, స్పోర్ట్స్ మీట్ సమన్వయకర్త డాక్టర్ విఘ్నేశ్వరరావు జెసప్ దేవ రాజ్, ఫిజికల్ డైరెక్టర్ జి.వి.వి బ్రహ్మం, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి రూ.10 వేలు ప్రోత్సాహం

ఉమ్మడి కృష్ణా బాడీ బిల్డింగ్ పోటీల్లో బంగారు పతకం, యూనివర్శిటీ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన బి.టెక్ తృతీయ సంవత్సర విద్యార్థి సూరవరపు దిలీప్‌ను ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే దిలీప్‌కు కళాశాల యా జమాన్యం తరఫున రూ.10వేలు నగదు పురస్కారాన్ని కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య అందజేశారు.

పెడన కౌన్సిల్ నేడు

పెడన : పెడన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి కమిషనర్ బి.ఏసుబాబు తెలిపారు. ఈ సమావేశంలో అజెండాలోని 27 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



పాత్రికేయులపై దాడికి నిరసన

పెడన : మీడియా ప్రతినిధులపై, మీడియా సంస్థలపై జరిగిన దాడులను ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం గూడూరులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కూటమి విజయం తథ్యం : వేదవ్యాస్

మచిలీపట్నం టౌన్ : రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని మా జీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. పెడన నియోజకవర్గంలో పర్యటనపై బూరగడ్డ వేదవ్యాస్ శుక్రవారం తన కార్యాలయంలో వివిధ గ్రామాల నాయకులతో చర్చించారు. శనివారం మల్లేశ్వరం, కృత్తివెన్ను ప్రాంతాల్లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేశారు. పాపాని నాంచారయ్య, గంటా రాంబాబు, దూతల మురళి, వెంట్రప్రగడ సురేష్, యిల్లూరి బాబి, పట్టపు నాగబాబు తదితదిరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లపై చర్చకు సిద్ధం : బండి

మచిలీపట్నం టౌన్ : గ్రామీణ ప్రాంత రోడ్ల విషయమై చర్చకు సిద్ధంగా ఉన్నామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ శుక్రవారం పేర్నికి సవాల్ విసిరారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా రోడ్లను అభివృద్ధి చేయలేదని, రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని అన్నారు. బండి రామకృష్ణ శుక్రవారం తుమ్మలపాలెం తదితర గ్రామాల్లో విస్తృతంగా ఇంటింటికీ పర్యటించారు. అనంతరం ఆయన విలేరుకరులతో మాట్లాడారు. ధాన్యం తోలిన రైతులకు బకాయిలు చెల్లించలేదన్నారు. ఓటమి భయంతోనే పేర్ని నాని ఇష్టారాజ్యంగా మాజీ మంత్రి కొల్లు రవీంద్రను విమర్శిస్తున్నారన్నారు. జనసేన, టీడీపీ కూటమి రానున్న ఎన్నికల్లో విజయం సాధించడం తధ్యమన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, జనసేన రూరల్ మండల అధ్యక్షుడు గల్లా తిమోతి తదితరులు పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామి తెప్పోత్సవం

కోడూరు : హంసలదీవి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ సమీపంలోని కోనేరులో స్వామివారి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

అన్నసమారాధన

నందివాడ (తమిరిశ) : తమిరిశ గ్రామ శివారు కుముదలవాడలో వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. విశేష పూజలు జరిపి స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. శుక్రవారం 400 మందికి అన్నసమారాధన నిర్వహించినట్లు నిఆలయ కమిటీ సభ్యులు గుత్తా త్రివిక్రమరావు తెలిపారు. అలమూరి లోకేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

వెంట్రప్రగడ పాఠశాలకు రూ.10వేల విరాళం

పెదపారుపూడి : వెంట్రప్రగడ జడ్పీ ఉన్నత పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయుడు నందమూరి సుబ్బారావు రూ.10 వేలు అందజేశారు. ఎస్‌బీఐ బ్యాంక్‌లో డిపాజిట్ చేసి పత్రాలను శుక్రవారం హెచ్‌ఎం హరికిషోర్‌కు అందజేశారు. తెలుగులో ప్రతిభ చూపిన విద్యార్థికి వడ్డీని ఇవ్వనున్నట్లు తెలిపారు.

మత్స్య సంఘాలపై అవగాహన

నాగాయలంక : మత్స్యవృత్తుల వారు ఆర్థిక స్వావలంబన సాధనకు పరస్పర స్వయం సహాయక సహకార సంఘాలు దోహదపడతాయని అవనిగడ్డ ప్రాంతీయ మత్స్య అభివృద్ధి అధికారి తమ్ములూరు సునీత అన్నారు. నాగాయలంకలోని రైతు భరోసా కేంద్రంలో భావదేవరపల్లి ఎంపీకేఆర్ ఫిషరీస్ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులకు, సహకార సంఘాల నిర్వహణపై అవగాహన కల్పించారు. మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు లకనం నాగాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భావదేవరపల్లి ఫిషరీస్ పాలిటెక్నికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అల్లి ఆశిత, మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ లంకే అమ్మాజీ, మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు కర్రా కృష్ణమూర్తి, వీఏఏ జగదీష్, మురళీ అవగాహన కల్పించారు.



మొవ్వలో వలంటీర్లకు సత్కారం

కూచిపూడి : గ్రామాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. మొవ్వ క్షేత్రయ్య కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. వలంటీర్లను సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పీటీసీ సభ్యుడు రాజులపాటి పార్వతీ, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మొవ్వ వేణుగోపాలస్వామి కల్యాణం

కూచిపూడి : రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సా యంత్రం స్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదుర్కోలు ఉత్సవం, నిత్యహోమం, బలిహరణ, హనుమత్ సుదర్శన నార సింహ హోమం, విశేష పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రజల మనిషి జటావత్ రెడ్డియ్య

ఘంటసాల : ప్రజలకు సేవ చేసిన గొప్ప మనిషి జటావత్ రెడ్డియ్య అని మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య పేర్కొన్నారు. తెలుగురావుపాలెం గ్రామంలో జటావత్ రెడ్డియ్య 24వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని రెడ్డియ్య అమర స్థూపం వద్ద అరుణ పతాకాన్ని ఎగురవేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాటూరి రామయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టు నేత, మాజీ సర్పంచ్‌గా పేద ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచిన వ్యక్తి రెడ్డియ్య అన్నారు. మంచి పనులు చేసే వారు ప్రజల హృదయాల్లో సుస్థిరంగా ఉంటారని తెలిపారు. సీపీఎం నాయకులు వాకా రామచంద్రరావు, ఎండి.కరీముల్లా, మాజీ ఎంపీటీసీ సభ్యులు కాట్రగడ్డ శ్రీనివాస చక్రవర్తి, ఆత్కూరి సీతారామరాజు, నడికట్ల భిక్షమ రాజు, కుమారుడు బాలాజీ నాయక్, కుటుంబసభ్యుల పాల్గొన్నారు.

ఓటరు చైతన్య ర్యాలీ

పెడన : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని తహసీల్దార్ కె. రాంబాబు సూచించారు. ఓటరు మహశయా మేలుకో - యువతరం ఓట్లు ప్రగతికి మెట్లు అనే నినాదంతో శుక్రవారం పట్టణంలో ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, ఎన్నికల విభాగం డీటీ కల్పన, ఆర్‌ఐ మణికుమార్, మెప్మా పీఎంసీ బోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీసీపీడీసీఎల్ లీగల్ కౌన్సిల్‌గా రఫీ

గుడివాడ : ఏపీసీపీడీసీఎల్ లీగల్ కౌన్సిల్‌గా స్థానిక న్యాయవాది షేక్ మహ్మద్ రఫీ నియమితులయ్యారు. గుడివాడ, మొవ్వ కోర్టులకు సంబంధించిన కేసులను రఫీ చూస్తారు. రఫీను గుడివాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మలచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కుటుంబరావు, సభ్యులు అభినందించారు.

ఉచిత వైద్యశిబిరం రేపు

గుడివాడ : ఆరోగ్యకరమైన గుడివాడే లక్ష్యంగా ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము పేర్కొన్నారు. వెనిగండ్ల ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30వ వార్డు వాసమాంబ గోడౌన్స్‌లో ఈనెల 25న మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. అన్ని రకాల పరీక్షలు జరిపి, మందులు, కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని వెనిగండ్ల కోరారు.



పాత పెన్షన్ విధానాన్ని టీడీపీ మేనిఫెస్టోలో చేర్చాలి

అవనిగడ్డ : పాత పెన్షన్ అమలును టీడీపీ మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు శుక్ర వారం మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బికనకారావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానంతోనే ఉద్యోగులు, ఉపాధ్యాయులు సంతోషంగా ఉంటారన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వరరావు, ఎల్.సుభాషిణి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జీవేంద్రరావు, శివరామకృష్ణ, సాంబశివరావు, స్వామి, కె.రవీంద్ర, సునీత, ముమ్మనేని శ్రీనివాసరావు, మొవ్వ శివకుమార్, ఎం.రత్నగిరిరావు, ఓలేటి రమేష్, శ్రీనివాసరావు, బుజ్జి, రాజశేఖర్ తదిరతులు పాల్గొన్నారు.

కేంద్ర వైఖరికి రైతు సంఘాల నిరసన

బంటుమిల్లి : రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ బంటుమిల్లిలో రైతు సంఘాలు నిరసన తెలిపాయి. కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో లక్ష్మీపురం సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం హింసాత్మక చర్యలను విడనాడి రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గొరిశెట్టి నాగేశ్వరరావు, మాజేటి శివ శ్రీనివాసరావు, అజయ్‌ఘోష్, మలిశెట్టి శివరామ ప్రసాదు, నాగిశెట్టి చంద్రశేఖర్, బొడ్డు నాగరాజు, కొమ్మలపాటి రవి, పొదిలివెంకన్న పాల్గొన్నారు.



వలంటీర్లకు ఎమ్మెల్యే కొడాలి సత్కారం

గుడ్లవల్లేరు : మండలంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్యఅతిథిగా హాజరై వలంటీర్లను సత్కరించారు. వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తూ సేవలందించాలని సూచించారు.

గుడ్లవల్లేరు ఎంపీడీవోగా నాగేశ్వరరావు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు ఎంపీడీవోగా వి.ఎస్.నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపీడీవో దారపు శ్రీనివాస్, ఈవోపీఆర్డీ దిలీప్ కుమార్ తాత్కాలిక సెలవుపై వెళ్లడంతో నందివాడ ఎంపీడీవోగా పనిచేస్తున్న నాగేశ్వరరావుకు గుడ్లవల్లేరు అదనపు పూర్తి బాధ్యతలు ఇచ్చారు.

పులిగడ్డలో నా సేన కోసం..

అవనిగడ్డ రూరల్ : నా సేన కోసం - నావంతు కార్యక్రమం పులిగడ్డలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, జనసేన నాయకులు చిలకలపూడి పాపారావు, విక్కుర్తి రాంబాబు, సూర్యనారాయణ మూర్తి, మల్లికార్జున్, అంకాని మహేంద్ర, పేర్ని జగన్, ఉస్మాన్ షరీఫ్, చోడగం విమల్ కృష్ణ, గంగయ్య, దామెర్ల నారాయణ, అర్జా కాంత్ కిరణ్, పసుపులేటి రవి, లోలాక్షుడు పాల్గొన్నారు.

సింధుస్నానాలకు విస్తృత ఏర్పాట్లు



కోడూరు, ఫిబ్రవరి 23 : మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు చేయనున్న నేపథ్యంలో హంసలదీవి సాగరతీరం వద్ద అధికారులు విస్తృత స్థాయి ఏర్పాట్లు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో 200 మంది బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వన్ వే విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. సముద్రతీరంలో, పవిత్ర సంగమ ప్రదేశంలో ప్రత్యేక వైద్యశిబిరాలు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. స్నానాలు ఆచరించేటప్పుడు భక్తులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు లోనుకాకుండా ప్రత్యేక బోట్లు ఏర్పాటు చేశారు. లోతైన ప్రాంతాల్లో భారీ గేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పవిత్ర సంగమ ప్రదేశంలో జల్లు స్నానాలకు కూడా ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను డీఎల్‌పీవో జ్యోతిర్మయి, అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, పర్యవేక్షించారు. శిథిలావస్థకు చేరిన కృష్ణవేణి విగ్రహాన్ని లెజెండ్ సోషల్ సర్వీస్ అధినేత పూతబోయిన అయ్యప్ప స్వామి ఆర్థిక సౌజన్యం రూ.20 వేలతో తీర్చిదిద్దారు.

కర్ణభక్తులకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తాం : వెనిగండ్ల



గుడివాడ : గుడివాడ ప్రజలకు తాను ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తానని, టీడీపీ, జనసేన ప్రభుత్వంలో కర్ణభక్త సంఘీయులకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము హామి ఇచ్చారు. పుల్లలపాడు వంతెన వద్ద కర్ణభక్త సంక్షేమ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్వచ్ఛందంగా తనకు మద్దతు తెలిపేందుకు ముందుకు వచ్చిన కర్ణభక్తులకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన పట్టణాధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, సంఘం జిల్లా అధ్యక్షులు తమ్మా రమేష్, సంఘం అధ్యక్షుడు పొన్నా మల్లేశ్వరరావు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సహాయ ఫౌండేషన్‌కు రూ.10 వేల విరాళం

మచిలీపట్నం టౌన్ : సహాయ ఫౌండేషన్ పేదలకు నిర్వహిస్తున్న క్యాంటీన్‌కు పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దామోదరం శుక్రవారం రూ. 10వేల విరాళం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, కాగిత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.